క్లుప్తంగా

హెచ్ఎంగా వైఎస్సార్‌కే ప్రసాద్


హెచ్ఎం ప్రసాద్ (ఫైల్)

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వైఎస్సార్‌కే ప్రసాద్ నియమితులయ్యారు. ఈయన దర్శి మండలం పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై తూర్పుగంగవరం వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అరుణకుమారి ఎం.నిడమనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

50 మందికి కంటి ఆపరేషన్లు


రోగులను ఆస్పత్రికి పంపుతున్న వైద్యాధికారులు

కురిచేడు: ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్ కోసం శంకర కంటి ఆస్పత్రికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం 50 మందిని తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రవితేజ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, ఏ.గురుస్వామి, శౌరీలు, తిరుపతిస్వామి, రమేష్, జాన్ పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో భక్తుల పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పెద్దారవీడు: యోగాతో ఒత్తిడి దూరం చేయడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఎంపీడీఓ జాన్‌సుందరం అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాలను పెంపొందించడంలో యోగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆనందం లభిస్తుందని తెలిపారు. యోగాలో ధ్యానం ఒక భాగమని, ధ్యానం చేస్తే జీవనశైలిలో ఎన్నో మార్పులు వస్తాయని వివరించారు. ఎంఈఓ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. యోగా చేస్తే దేహదారుఢ్యం పెరగడంతో పాటు మేథోశక్తిని పెంచుకోవచ్చన్నారు. కొత్తపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వెంకటరావు, పీఈటీ సురేష్‌లు యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించి ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు.

క్రికెటర్ శ్రీశాంత్‌కు సన్మానం


క్రికెటర్ శ్రీశాంత్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ పద్మజ దంపతులు

పెద్దదోర్నాల: టీం ఇండియాకు సెలక్ట్ అయిన క్రికెటర్ శ్రీశాంత్‌ను ఎంపీపీ గుమ్మా పద్మజ, బీసీ సంఘ జిల్లా కార్యదర్శి గుమ్మా యల్లేష్ దంపతులు గురువారం ఘనంగా సత్కరించారు. వచ్చే నెల కెన్యాలో జరుగుతున్న రోల్ బాల్ వరల్డ్ కప్ చాంపియన్ షిప్ 2025కి ఇండియా తరఫున సెలక్ట్ అయిన మోటాపర్తి శ్రీశాంత్‌తో పాటు కోచ్ శిల్పావాగ్రేలను ఎంపీపీ దంపతులు సత్కరించారు. హైదరాబాద్‌లోని సీఆర్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గుమ్మా యల్లేష్ దంపతులు శ్రీశాంత్, కోచ్ శిల్పావాగ్రేలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రోల్‌బాల్ వరల్డ్ కప్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చాలని కోరుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

నిలిచిన రేషన్ బండి

- ఒకటో తేదీ నుంచి చెంచులకు తప్పని మోత బరువు
- 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడేల వాసులకు కష్టాలు
- ప్రతి రేషన్ షాపు ఎదుట క్యూ కట్టాల్సిందే
- జగనన్న పాలనలో ఇంటి ముంగిటకే రేషన్


పుల్లలచెరువులో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ బండి (ఫైల్)

యర్రగొండపాలెం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు ఏదో ఒక రకంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. జూన్ 1వ తేదీ నుంచి పేదలకు మరోకొత్త ఇబ్బంది వచ్చి పడింది. ముఖ్యంగా నల్లమల అడవుల్లో నివశించే చెంచులు రేషన్ కోసం సుదూర ప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లి రేషన్ బియ్యం మూటలు నెత్తిన పెట్టుకొని తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాళ్లే కాదు పట్టణాల్లో నివశించే పేదలు సైతం దూర ప్రాంతాల్లో ఉన్న రేషన్ షాపుల వద్దకు వెళ్లి అక్కడ క్యూ కట్టి రేషన్ బియ్యం కోసం వేచి చూడాల్సిన రోజులు దగ్గరపడ్డాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)లను ప్రవేశ పెట్టారు. వాహనాలు ఇంటింటికీ తిరిగి రేషన్ అందజేసేవి. దీంతో ప్రజలకు సేవలు అందించే అవకాశం ఇవ్వడంతో పాటు వాటి నిర్వాహకులకు ఉపాధి కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో పాలకులు ఎండీయూల ఉపాధి లాక్కున్నారు. ప్రజలకు ఇక్కట్లు పెట్టారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం రేషన్ షాపులు 173, రేషన్ కార్డులు 83,581, ఎండీయూ బండ్లు 49 ఉన్నాయి. ఆయా రేషన్ షాపుల పరిధిలో ఉన్న పేదలు రేషన్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ పడికాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితి తెలుగు రాష్ట్రాలు కలిసి ఉన్న కాలం నుంచి కొనసాగేది. ఎక్కువగా టీడీపీ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తొలుత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పాతపద్ధతినే కొనసాగించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల క్షేమం కోసం ఎండీయూలను ప్రవేశ పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి పాత పద్ధతిలోకి తీసుకెళ్లింది. యర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజన గూడెం రేషన్ షాపు పరిధిలో 4 చెంచు గూడేలు ఉన్నాయి. నెక్కంటి, ఇష్టకామేశ్వరి గూడేల్లో నివశించే చెంచులు 25 నుంచి 30 కిలో మీటర్లు వెళ్లాల్సి ఉంది. పొన్నల బైలు 8 కిలో మీటర్లు, గుట్టల చేను 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న పాలుట్లకు వెళ్లి రేషన్ తీసుకోవాలి. వెంకటాద్రిపాలెం రేషన్ షాపు పరిధిలో ఉన్న హనుమంతుని గూడెం, అంకమ్మ గూడెం, గంజివారిపల్లె రేషన్ షాపు పరిధిలో ఉన్న అల్లిపాలెం, గాంధీ నగర్, శాంతినగర్, వీరభద్రాపురం రేషన్ షాపు పరిధిలో ఉన్న బిల్లగొందిపెంట, పోతురాజుగూడెం, కాశికుంట తండా పరిధిలోని పిల్లికుంట తండా, మెట్టబోడు తండా, నాగరాజు తండా గిరిజనులు దాదాపు కిలో మీటరు నుంచి 10 కిలో మీటర్ల దూరం వెళ్లాలి. పెద్దదోర్నాల మండలం చింతల చెంచుగూడెం రేషన్ షాపు పరిధిలో ఉన్న మర్రిపాలెం, తుమ్మలబైలు, చినారుట్ల గూడెం చెంచులు దాదాపు 5 నుంచి 20 కిలో మీటర్ల దూరం, నల్లగుంట్ల రేషన్ షాపు పరిధిలో ఉన్న బోరుగూడెం, అయ్యన్నకుంట, కొర్రపోలు, పెద్ద మంతనాల రేషన్ షాపు పరిధిలో ఉన్న పెద్దమంతనాల చెరువు గూడెం, చిన్నమంతనాల, రోళ్లపెంట, చిలకచర్ల రేషన్ షాపు పరిధిలో ఉన్న చిలకచర్ల గూడెం, చిన్నగుడిపాడు రేషన్ పరిధిలో ఉన్న భ్రమరాంబ చెంచుకాలనీ చెంచులు దాదాపు కిలో మీటరు నుంచి 8 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసి రేషన్ తెచ్చుకోవాలి. పుల్లలచెరువు మండలం గారపెంట రేషన్ షాపు పరిధిలో ఉన్న చెన్నపాలెం చెంచులు 14 కిలో మీటర్లు, ఐటీ వరం రేషన్ షాపు పరిధిలో ఉన్న గండిబావి గూడెం చెంచులు 3 కిలో మీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రేషన్ షాపుల వివరాలు

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు	తొలగించిన ఎండీయూ బండ్లు
వై.పాలెం	43	19,917	12
పుల్లలచెరువు	42	17,714	11
త్రిపురాంతకం	35	18,938	11
పెద్దారవీడు	23	13,543	8
పెద్దదోర్నాల	30	13,469	7
మొత్తం	153	83,581	49

కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


పూరిమెట్లలో భాస్కరరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


ఈదరలో మహేంద్రరెడ్డి తండ్రిని పరామర్శిస్తున్న బూచేపల్లి


సింగన్నపాలెంలో పార్టీ నాయకుడిని పరామర్శిస్తూ..

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని పూరిమెట్లలో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న పార్టీ నాయకులు భాస్కరరెడ్డిని ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈదరలో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మహేంద్రారెడ్డి తండ్రిని పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఉల్లగల్లు, పసుపుగల్లు, శింగనపాలెం, పోలవరం గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను ఆయన పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, దర్శి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, జెడ్పీటీసీ రత్నరాజు, చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి, సింగన్నపాలెం సర్పంచ్ గీతాంజలి, కృష్ణారెడ్డి, గురవారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి


రైతులకు వివరాలు తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు

కురిచేడు: రాబోయే ఖరీఫ్ పంటకు రైతులు సన్నద్ధం కావాలని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి టి.మానస పేర్కొన్నారు. మండలంలోని పొట్లపాడులో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏ విధంగా శాస్త్రవేత్తల సలహాలతో సన్నద్ధమవ్వాలో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి వివరించారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా వారి పొలాలను లోదుక్కులు చేపట్టాలని, తద్వారా భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని, కలుపును కూడా సమర్థంగా అరికట్టవచ్చని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు తెలిపారు. మట్టి, నీటి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యానవన శాఖాధికారి బి.ధనలక్ష్మి మండలంలోని ఏయే గ్రామాలు ఏయే పంటలకు అనుకూలంగా ఉంటాయి, ఏ పంటలు సాగు చేసుకోవాలి, వాటి యాజమాన్య పద్ధతులు ఎలా చేపట్టాలో వివరించారు. ఏయే ఉద్యానవన పంటలకు సబ్సిడీ వస్తుంది, అవి ఎవరెవరికి వర్తిస్తాయి అనే వివరాలు వెల్లడించారు. మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు పంటల నమోదు, ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల గురించి వివరించారు. ఆత్మ ఒంగోలు నుంచి కె.రామిరెడ్డి, వీఏఏ రామాంజనేయులు, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి


సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న లింగారెడ్డి

పెద్దదోర్నాల: నేషనల్ హైవేలో భూమిని కోల్పోయిన తనకు నష్ట పరిహారం వచ్చేలా చూడాలని కోరుతూ మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ యక్కంటి లింగారెడ్డి గురువారం తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. తనకు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 319–3లో 2 ఎకరాల 14 సెంట్ల భూమి ఉందన్నారు. నేషనల్ హైవే 765లో తనకు సంబంధించిన వ్యవసాయ భూమిలో 42 సెంట్ల స్థలాన్ని రోడ్డు విస్తరణలో కోల్పోయినట్లు తెలిపారు. కానీ ఇంత వరకు తాను కోల్పోయిన భూమికి నష్టపరిహారం అందలేదన్నారు. తన భూమికి ల్యాండ్ కన్వర్షన్ నోటిఫికేషన్‌కు 4 నెలల ముందే అయిందన్నారు. అధికారులు స్పందించి భూమి విలువకు నష్టపరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా నష్టపరిహారం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

అర్హులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దర్శి (కురిచేడు): అర్హులకు నివేశన స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం. రమేష్‌బాబు కోరారు. జూన్ 2న సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను గురువారం స్థానిక గుజ్జుల సరశాదేవి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ఇంటి స్థలాన్ని, ఇంటిని ప్రభుత్వమే మంజూరు చేసి నిర్మాణానికి సహకరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాన్ని పేదలకు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిర్మాణంలో ఉండి ఆగిపోయిన టీడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. గతంలో సచివాలయాల ముందు ధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, లేదంటే పేదలతో పెద్ద ఎత్తున భూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, సీపీఐ సీనియర్ నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కార్యదర్శి సింగరకొండ శ్రీను, దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డివైడర్లపై చెత్త వేస్తే జరిమానా

యర్రగొండపాలెం: స్థానిక పంచాయతీ పరిధిలోని డివైడర్లపై చెత్త వేస్తే జరిమానా విధించాల్సి ఉంటుందని సర్పంచ్ రమావత్ అరుణాబాయి హెచ్చరించారు. గురువారం ఆమె మాచర్ల–మార్కాపురం రోడ్డులో ఉన్న డివైడర్లను శుభ్రం చేయించారు. డివైడర్లకు రెండు వైపులా ఉన్న వ్యాపారులు దుకాణాలు మూసే సమయంలో చెత్త తీసుకొచ్చి డివైడర్లపై పడేస్తున్నారు. పంచాయతీ కార్మికులు ఉదయం, సాయంత్రం చెత్తను ఎత్తేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో పట్టణం అపరిశుభ్రంగా ఉండటంతో పాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. ఈ మేరకు సర్పంచ్ చర్యలు తీసుకోవడంతో పాటు డివైడర్లపై, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసిన వారిని గుర్తించి వారికి రూ. వెయ్యి జరిమానా విధిస్తామని ఆమె స్పష్టం చేశారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు సాగర్ జలాలు


సాగర్ జలాల పంపింగ్

దొనకొండ: మండలంలోని చందవరం వద్ద ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజీ–1, 2లకు సాగర్ జలాలు అధికారులు విద్యుత్ మోటార్లతో పంపింగ్ చేస్తున్నారు. మండలంలోని 29 గ్రామాలకు నీరు సరఫరా చేసే చందవరం–1 స్టోరేజీకి 70 శాతం నీటితో ఉందని, నూరు శాతం నింపేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. కొనకనమిట్ల, హెచ్ఎంపాడు, పొదిలి మండలాల్లోని 127 గ్రామాలకు సరఫరా జరిగే చందవరం–2 స్టోరేజీలో 60 శాతం నీరు ఉందని, వారం రోజుల పాటు సాగర్ జలాలు కాలువల ద్వారా సరఫరా అవుతున్నాయని, నూరు శాతం నింపేందుకు తమ సిబ్బంది మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3 నెలల పాటు గ్రామాల్లోని ప్రజలకు సాగర్ నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.

రేషన్ పంపిణీ విధానంలో మార్పు


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

పుల్లలచెరువు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జూన్ 1 నుంచి రేషన్ బియ్యం పంపిణీ తిరిగి రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయనున్నట్లు తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసిన విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని, ఇకపై మళ్లీ షాపుల నుంచే పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. రేషన్ షాపులు, లైసెన్స్ ఉన్న పొందిన షాపుల్లోనే నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలని ఆయన సూచించారు. అంతేగాక షాపుల్లో స్టాక్ నిల్వ సామర్థ్యం, డిజిటల్ తూకాల వాడకాన్ని అధికారుల అనుమతితో వాడాలన్నారు. పంపిణీ వివరాలు, సమయాల బోర్డులు షాపుల్లో ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగుల జాబితాను గుర్తించి వారికి సరుకులు ఇంటి వద్దే అందించాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి కొత్త విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులకు తావు లేకుండా డీలర్లు తమ విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దారవీడు: రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ సరుకులు తప్పనిసరిగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చౌకదుకాణాల డీలర్ల సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్ తమ రేషన్ షాపు దగ్గర బోర్డు కచ్చితంగా లబ్ధిదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని, తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాలని, కార్డుదారులకు అందుబాటులో ఉంటూ బియ్యం పంపిణీ చేయాలని, స్టాక్ రిజిస్టర్ సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ప్రకారం సరుకులు ప్రతి కార్డుదారుని పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డీటీ ఇబ్రహీం ఖలీల్, ఎంఆర్ఐ శివ, ఇతర అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

కౌలుకార్డుల జారీపై సిబ్బందికి అవగాహన


మాట్లాడుతున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): ఈ ఏడాదికి కౌలుకార్డుల జారీపై గ్రామస్థాయి సిబ్బందికి మండల కేంద్రం ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. వీఆర్వోలు, రైతు సేవాకేంద్రం సిబ్బందికి 2025–26 సంవత్సరానికి కార్డులు జారీ చేసే అంశంపై తహసీల్దార్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విధి విధానాలను మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. మండలానికి ఈ ఏడాదికి 1331 కౌలు కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. గ్రామస్థాయిలో వాస్తవ సాగుదారుల వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది సేకరించి గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో వీఆర్వో, రైతు సేవా కేంద్రం సిబ్బంది ముందుగా గ్రామ నాయకులు, రైతులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసి సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగానే ప్రతి వాస్తవ సాగుదారుడు గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సిబ్బందిని, లేదా వీఆర్వోని సంప్రదించి కౌలు కార్డులు పొందాలని తెలిపారు. కేవలం సాగుదారు హక్కు పత్రాలు ఉన్న కౌలురైతులకు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలైన ఈ పంటనమోదు, అన్నదాత సుఖీభవ, విత్తనాల పంపిణీ, సూక్ష్మపోషకాలు రాయితీ రూపంలో రానున్న రోజుల్లో అందుతాయని వివరించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ ఆధారంగా కౌలుకార్డులు జారీ చేయాలని తెలిపారు. జూన్ నెల చివరి వారంలోపు గ్రామంలోని ప్రతి కౌలుదారుని పంట సాగుదారు హక్కు పత్రం జారీ చేయాలని ఆదేశించారు.

లోదుక్కులు దున్నుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దొనకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వాతావరణం అనుకూలంగా ఉందని, గ్రామాల్లోని రైతులు పొలాలను లోదుక్కులు దున్నుకుని భూమి నుంచి ఆశించే వేరు కుళ్లు, తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్‌పై కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వాతావరణంలో మార్పులు వచ్చాయని, రైతులు విత్తనాలు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖను సంప్రదించి సూచనలు, సలహాలు పొందాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాలకు అనువైన పంటల రకాలు, వాటి గుణగణాలను వివరించారు. పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ షణ్ముగం మాట్లాడుతూ కోళ్ల పెంపకం, మేకలు, పశువులు పెంపకాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. కేవీవికే నోడల్ అధికారి కె.సంధ్యారాణి, వీసీఎస్ నారాయణ, రమేష్‌దాస్, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


పొలంలో ఒకవైపు ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలు

పుల్లలచెరువు: మండలంలోని కవలకుంట్ల పొలాల వద్ద రెండు విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఈ రహదారి వెంట అధికారులు ప్రయాణిస్తున్నా వారికి కనిపించక పోవడం దారుణం. ప్రస్తుతం వర్షాలు, గాలులు వీస్తున్న తరుణంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టం జరగడం ఖాయం. ఈ రెండు స్తంభాలు ఒరిగి ఉన్న పొలాలు యర్రగొండపాలెం, పుల్లలచెరువు ప్రధాన రహదారి పక్కనే ఉన్నాయి. అనుకోని ప్రమాదం జరిగితే నష్టం బాగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

తాళ్లూరు: నిత్యావసరాలను పరిశుభ్రమైన గదుల్లో ఉంచాలని, రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంజీవరావు హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ సరుకుల పంపిణీపై రేషన్ డీలర్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ సరుకుల పంపిణీని జూన్ 1 నుంచి షాపుల ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ రేషన్ సరుకులు ప్రజలకు అందించాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. డీటీ ఇమ్మానియేల్ రాజ్ మాట్లాడుతూ రేషన్ షాపులు నిర్ణీత సమయం పాటిస్తూ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నిర్వహించాలని, రేషన్ సరుకుల పంపిణీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ప్రజలకు అందించాలన్నారు. వీఆర్ఓలు, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.


డీలర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సంజీవరావు